త్వరలో గ్రామాలకు శాస్త్రవేత్తల బృందం

బి.కొత్తకోట: కొబ్బరి పంటకు సోకుతున్న సర్పిలకర తెల్లదోమ వైరస్‌ను పరిశోధించేందుకు భారతీయ పరిశోధనా మండలికి చెందిన జీవ నియంత్రణ విభాగం శాస్త్రవేత్తల బృందం బి.కొత్తకోట మండలంలో పర్యటించనుందని బయ్యప్పగారిపల్లె ఉద్యావన పరిశోధనా కేంద్రం తెగుళ్ల విభాగం సీనియర్ శాస్త్రవేత్త శేషకిరణ్ చెప్పారు. శుక్రవారం ఆయన మండలంలోని గుంతావారిపల్లెలో కొబ్బరిపంటకు పొడిమందు పిచికారి చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తలు కొబ్బరిపంటను పరిశీలించి తెల్లదోమపై పరిశోధిస్తారని చెప్పారు. దీన్ని ఎలా అదుపు చేయాలని, చేపట్టాల్సిన యాజమాన్య పద్దతులపై రైతులకు వివరిస్తారని చెప్పారు. పరిశోధనా కేంద్రం ద్వారా రైతాంగానికి ప్రయోజనకరమైన చర్యలు తీసుకొంటున్నామని చెప్పారు. స్థానిక సర్పంచు భీమిగాని నాగిరెడ్డి, రైతులతో శేషకిరణ్ సమావేశమై ప్రస్తుతానికి చేపట్టాల్సిన నివారణ చర్యలను సూచించారు.

చేపల చెరువు వేలం

రామసముద్రం: పెద్దకురప్పల్లె పంచాయతీలోని నందూరు చెరువు, తిమ్మిరెడ్డి చెరువులలో చేపల పెంపకానికి సర్పంచ్ రెడ్డెప్పనాయుడు అధ్యక్షతన వేలం నిర్వహించారు. రూ.78 వేల ఆదాయం పంచాయతీకి సమకూరింది.



మహిళలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

- మోసగించే చంద్రబాబును నమ్మకండి
- ఆసరా చెక్కుల పంపిణీలో ఎంపీ మిథున్‌రెడ్డి


వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

రామసముద్రం: దేశంలోనే మహిళలకు ఎక్కడ ఇవ్వని ప్రాధాన్యత ఏపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్నారని, అందుకు సంకేతం వైఎస్సార్ ఆసరా పథకమేనని ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ ఆసరా చెక్కులను ఎమ్మెల్యే నవాజ్‌బాషా సమక్షంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రామసముద్రం మండలంలో 886 స్వయం సహాయక సంఘాల గ్రూపులలోని 8239 మంది సభ్యులకు గాను రూ.6 కోట్లు అరవై లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లోకి జగనన్న ప్రభుత్వం జమ చేయడం జరిగిందన్నారు. అలాగే మండలంలో గ్రామీణాభివృద్ధి క్రింద రోడ్లు వేశామని, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి రూ.10 లక్షలతో ఆధునికీకరణ చేశామన్నారు. అలాగే మండలానికి వాటర్ గ్రిడ్ క్రింద ప్రతి గ్రామానికి నీటిని అందించేందుకు హంద్రినీవా జలాలు తీసుకురావడం జరుగుతుందన్నారు. చంద్రబాబు నాయుడు మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చి ప్రజలకు ఏమి చేసింది లేదన్నారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప , ఎమ్మెల్యే నవాజ్‌బాషా, పీకెఎం ఉడా చైర్మన్ వెంకట రెడ్డి యాదవ్ మాట్లాడుతూ జగనన్నను ఆదరిస్తే మరెన్నో పథకాలతో పేద ప్రజలను ఆదుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమకుమారి, వైస్‌ఎంపీపీలు రమణారెడ్డి, గంగాధర్‌నాయుడు, కన్వీనర్ భాస్కర్‌గౌడు, సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, కృష్ణారెడ్డి, ఎంపీడీవో సురేష్‌బాబు, ఏపీఎం సుబ్రమణ్యం, తహశీల్దార్ దైవరాజన్, నాయకులు నందకుమార్‌రెడ్డి, దొడ్డిపల్లి ఆనంద, రాధాకృష్ణ, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో వాహన యజమానులదే కీలక పాత్ర

– డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : వాహనాలకు సంబంధించిన నేరాలు నియంత్రణలో యజమానులదే కీలకపాత్ర అని మదనపల్లె డీఎస్పీ కేశప్ప అన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ప్రైవేటు పంక్షన్‌హాల్‌లో మదనపల్లె డివిజన్‌లోని లారీ, మినీ లారీ, కారు డ్రైవర్లతో జిల్లా ఎస్పీ గంగాధరరావు ఆదేశాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు అక్రమ రవాణా ఏదైనా జరుగుతుంటే వెంటనే సమాచారం అందించాలన్నారు. డ్రైవర్లు తమ ప్రయాణ సమాచారాన్ని యజమానులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. వాహన రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్‌లో దిశ యాప్‌ను ఉపయోగించి సమస్య ఎదురైనప్పుడు పరిష్కరించుకోవాలన్నారు. రాత్రిలో ప్రయాణించేటప్పుడు తప్పక డ్రైవర్లు విశ్రాంతి తీసుకోవాలన్నారు. డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తే ప్రమాదాలు నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో టూటౌన్‌సీఐ మురళీకృష్ణ, ఎస్ఐలు హరిహరప్రసాద్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి

– ఆర్డీఓ మురళి

మదనపల్లె : జగనన్న పక్కా గృహం పథకంలో భాగంగా గృహాలు మంజూరైన లబ్ధిదారులు వెంటనే గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని ఆర్డీవో ఎం.ఎస్.మురళి అన్నారు. శుక్రవారం మదనపల్లె మండలంలోని పోతబోలు గ్రామం వద్ద ఉన్న జగనన్న లేఅవుట్‌ను ఆయన తనిఖీ చేశారు. లబ్ధిదారులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనులపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు గృహ నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించకపోతే వారికి మంజూరు చేసిన పట్టాలను ప్రభుత్వం రద్దు చేస్తుందని హెచ్చరించారు. స్థానిక జగనన్న లేఅవుట్‌లో 3300 మందికిపైగా పట్టాలు మంజూరు చేశామన్నారు. 190 మంది లబ్ధిదారులు నిర్మాణాలు పూర్తి చేయగా మరో 800 మంది ఇంకనూ పనులు ప్రారంభించలేదని తెలిపారు. వారికి మరోసారి అవకాశం కల్పిస్తున్నామని, వెంటనే గృహ నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. స్థానిక లేఅవుట్‌లో గృహ నిర్మాణాల కోసం పైప్‌లైన్ ఏర్పాటు చేసినా నిర్వహణ లోపంతో సమస్యలు ఎదురవుతున్నాయని లబ్ధిదారులు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ రామస్వామిరెడ్డి, ఏఈ దీనదయాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా బ్రహ్మోత్సవాలు

కురబలకోట: మండలంలోని తెట్టు శ్రీ వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రథోత్సవాన్ని (తేరు) ఘనంగా నిర్వహించారు. గోవిందా..గోవింద అంటూ స్వామి వారి రథాన్ని భక్తులు ముందుకు లాగారు. స్వామి వారి నామస్మరణ మారుమోగింది. గురువారం రాత్రి స్వామి వారి కల్యాణోత్సవం కన్నుల పండగలా సాగింది. అనంతరం అదే రోజు రాత్రి గరుడోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొరివి జగన్నాథరెడ్డి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా జరిగాయి.

పేపర్ ప్రజంటేషన్‌లో ప్రతిభ

మదనపల్లె సిటీ: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన శాటిలైట్ ఇంటర్నెట్, స్టార్ లింక్ పేపర్ ప్రజెంటేషన్‌లో ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు పృథ్వీనారాయణ, నవీన్‌కుమార్‌రెడ్డి చక్కటి ప్రతిభను కనబరిచారు.